క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కందుకూరు: మండల పరిధిలోని గూడూరు గేట్ వద్ద ఉన్న మహేశ్వరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గవర్నర్ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఇటీవల ఆ గురుకులాన్ని సందర్శించి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తానని హామీ నిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదేశాలతో హైదరాబాద్ యశోద ఆస్పత్రి వైద్య బృందం గురుకులంలోని విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మజ్లిస్ పార్టీవి స్వార్థపూరిత రాజకీయాలు

పహాడీషరీఫ్: రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో స్వార్థ ప్రయోజనాల కోసం మజ్లిస్ పార్టీ జతకడుతోందని బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యనిర్వాహక కార్యదర్శి షర్ఫొద్దీన్ హామెద్ మండిపడ్డారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల పాటు కేసీఆర్‌ను దేశ్ కీ నేత అంటూ పొగిడిన మజ్లిస్, ప్రస్తుతం అధికారం మారే సరికి కాంగ్రెస్ పంచన చేరి బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పాతబస్తీలో కుటుంబ పాలన సాగిస్తున్న మజ్లిస్‌కు బీఆర్ఎస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. పాతబస్తీలో ఏకచత్రాధిపత్యం చలాయిస్తున్న ఆ పార్టీ ముస్లింల బాగు కోసం ఏమి చేసిందో చెప్పాలన్నారు. ముస్లింలు ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతుంటే మజ్లిస్ నేతలు మాత్రం వేలకు పడగలెత్తుతున్నారన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



19వ డివిజన్ పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ గాయత్రీనగర్ కాలనీలో శనివారం సీసీరోడ్ల నిర్మాణ పనులను మేయర్ చిగురింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాణ్యతగా పనులు పూర్తిచేసి ప్రజలు, కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విచ్చేసిన ముఖ్యులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రామోజి అమితశ్రీశైలంచారి, లక్కిశెట్టి మనోహర్,ధనేశ్వర్‌రెడ్డి, భాను, సుధాకర్, ఈశ్వ రోజుచారి,కాలనీవాసులు,మహిళలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహేశ్వరం: ఫ్యాబ్‌సిటీ 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ చక్రపాణి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని వెస్ట్ కోస్ట్, ప్రీమియర్, తుమ్మలూరు ప్లాస్టిక్ పార్కు, ఇమాంగూడ, రాచులూర్ గేటు, పెద్దమ్మ టెంపుల్, మహేశ్వరం టౌన్, సిరిగిరిపురం, తుమ్మలూరు, ఎస్టీ తండా, దయాల్‌గుండు తండా, కావలోని బాయి తండా, అశ్విణి కంపెనీ, ఆర్ఎస్‌పీ మినరల్స్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని ప్రజలు, రైతులు, వ్యాపారులు, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మండలస్థాయి పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, నిర్వాహకులు

తుక్కుగూడ: మండలస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత సూచించారు. శనివారం పురపాలక కేంద్రంలో సీఎం కప్ మండలస్థాయి సైక్లింగ్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారుల ప్రతిభను గుర్తించడానికి ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజమౌని రాజు, జపాల భావన, తెలంగాణ ఒలంపిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మల్లారెడ్డి, నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



వివరాలు సేకరిస్తున్న అధికారులు

- ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో 92,833 దరఖాస్తులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా సాగుతోంది.నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. లబ్ధిదారులను గుర్తించేందుకు నేరుగా సిబ్బంది వారి ఇళ్ల వద్దకు వెళ్తున్నారు. మూడు సర్కిళ్ల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 92,833 దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను కంప్యూటర్‌లో భద్రపర్చారు. వీటి ఆధారంగానే సర్వే జరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అత్యధికంగా ఎల్‌బీనగర్ సర్కిల్–3లో దరఖాస్తు చేసుకున్నారు. నాలుగు డివిజన్లలో 36,967 దరఖాస్తులు చేసుకోగా ఎల్‌బీనగర్ సర్కిల్– 4లో 26,568, సర్కిల్–5లో 29, 298 మంది అర్జీలు పెట్టుకున్నారు.

నాలుగు కాలమ్స్‌తోనే సర్వే..

సర్వే సిబ్బంది యాప్‌లో కేవలం నాలుగు కాలమ్స్ మాత్రమే ఉండడంతో సర్వే వేగంగా సాగుతోంది. సొంత స్థలం ఉందా? ఉంటే వాటికి సంబంధించిన దస్త్రాలు, ఇక్కడ నివాసముంటున్నావా.లేదా? సొంత స్థలం ఉంటే ఇంటి ముందు నిల్చున్న ఫొటోలు తీసుకుని అప్‌లోడ్ చేస్తున్నారు. ఖాళీ జాగా ఉందనే వివరాలు నమోదు చేశాక సంబంధిత వ్యక్తి పేరిట ఆ స్థలం ఉందా, ఇతర కుటుంబ సభ్యుల పేరిట ఉందా అనేది పూరించాలి. విద్యుత్ బిల్లును కూడా నిక్షిప్త పరిచాలి. స్థలం ఫొటో, డాక్యుమెంట్ పొందుపరచాలి. లబ్ధిదారులకు సరిన్ల సమాచారం ఇవ్వకపోవడంతో వారివారి పనులకు వెళ్తున్నారు. దీంతో సర్వే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చినట్లయితే ఇళ్ల వద్దనే ఉంటామని పలువురు పేర్కొంటున్నారు.

దరఖాస్తుల వివరాలు..

డివిజన్	దరఖాస్తులు
నాగోలు	9,981
మన్సూరాబాద్	10,403
హయత్‌నగర్	10.015
బీఎన్‌రెడ్డినగర్	6,568
వనస్థలిపురం	4,915
హస్తినాపురం	7,666
చంపాపేట	5,612
లింగోజిగూడ	8,375
సరూర్‌నగర్	6,691
ఆర్కేపురం	6,562
కొత్తపేట	6,865
చైతన్యపురి	4,584
గడ్డిఅన్నారం	4,596
మొత్తం	92,833

సర్వేకు సహకరించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజ

ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వచ్చిన అధికారులకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ శైలజ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వేకు వచ్చిన అధికారులకు పూర్తి వివరాలతో కూడిన సమాచారం అందించాలని కోరారు. అధికారులు అడిగిన సమాచారాన్ని క్లుప్తంగా చెప్పాలన్నారు. అంతకుముందు ఆమె ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్‌ను పరిశీలించి సర్వేకు వచ్చిన అధికారులు, ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మధ్యాహ్న భోజనం, వంట గదిని ఆమె పరిశీలించి ఉపాధ్యాయులు, వంట సిబ్బందితో ఆమె మాట్లాడారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను విడుదల చేస్తున్న ఆందోజ్ రవీంద్రచారి

దిల్‌సుఖ్‌నగర్: ఈ నెల 26 జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 100 వసంతాల ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ కార్యవర్గ సభ్యుడు ఆందోజ్ రవీంద్రచారి పిలుపునిచ్చారు. సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ ఆధ్వర్యంలో శనివారం కొత్తపేట బాబూ జగ్జీవన్ రామ్ భవనం వద్ద ఉన్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహం దగ్గర ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి 100 సంవత్సరాలలోకి అడుగు పెడుతుందన్నారు. దేశంలో 100 సంవత్సరాల ఉద్యమ పార్టీగా సీపీఐ ఖ్యాతి పొందిందన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని వాడవాడలో బస్తీలలో ఎర్ర తోరణాలు అలంకరించి జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి ఫైమీద, గ్యార క్రాంతికుమార్, మదిలేటి, వినోద్ కుమార్, గంగాధరి శ్రీనివాస్, పూజారి అనిత, పార్వతమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

పీసీసీ కార్యదర్శి జానకీరామ్

తుక్కుగూడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని పీసీసీ కార్యదర్శి గోగికర్ జానకీరామ్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపాలిటీలో ఆయన మాట్లాడారు. దేశంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన గొప్ప నాయకుడు అంబేడ్కర్ అన్నారు. అలాంటి మహనీయుడిపై తప్పుగా మాట్లాడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ఆయనను వెంటనే కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



పూజలో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి, నాయకులు

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి


షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎర్రోనిగూడ గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన, 7వ వార్షికోత్సవం సందర్భంగా యజ్ఞహోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, మద్దూరు పాండు, మాజీ సర్పంచ్‌లు బండ మహేందర్‌గౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం

ఆపదలో ఉన్న ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన షాబాద్ సహకార సంఘం చైర్మన్ మద్దూరు మల్లేశ్‌ను ఆయన పరామర్శించారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆటో కార్మికులు సీఐటీయూ నాయకులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంతో మంది పేదలు రవాణా రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో చాలా మంది యువకులు ఆటోలను నడిపిస్తున్నారని, వా రి అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ పథకా లు ప్రవేశపెట్టలేదన్నారు. ఆటో కార్మికులపై ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు విపరీతమైన పెనాల్టీలు వేస్తున్నారన్నారు. ప్రభుత్వం త్రీవీలర్ ఆటోలకు స్థానికంగా రిజిస్ట్రేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత, బీడీ, గీత కార్మికులకు ఇస్తున్నట్లు ఆటో కార్మికులకు కూడ జీవన భృతి కింద ప్రభుత్వం రూ.4500 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రమా ద బీమా కింద రూ.5లక్షలు, ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల ఉచిత వైద్యాన్ని అందించాలన్నారు.

వైభవంగా పడి పూజ



పడి పూజలో అయ్యప్ప భక్తులు

శంషాబాద్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప మహా పడి పూజను వైభవంగా నిర్వహించారు. మధుసూదన్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన 18 మహాపడి పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి నామస్మరణలు, భక్తి పాటలు, భజనతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. అనంతరం అన్న ప్రసాద (భిక్ష) వితరణ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్. గణేష్‌గుప్తా, మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

ఎల్‌బీనగర్: నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు వేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శ్రీరాంనగర్ కాలనీ నుంచి సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ వరకు వేస్తున్న తారురోడ్డు పనులను శనివారం ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీవాసులకు ఇబ్బందులు రాకుండా పనులు చేయాలన్నారు. డివిజన్‌లో అధ్వానంగా ఉన్న రోడ్లను మళ్లీ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏఈ రాజ్‌కుమార్, కాలనీవాసులు వెంకటరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నార.



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

అ'పూర్వ' కలయిక

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ మాటూరి వెంకట సుబ్బారావు ఇంజనీరింగ్ కళాశాల(ఎంవీఎస్ఆర్) క్యాంపస్‌లో శనివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించుకున్నారు. ఉస్మానియా యూనివర్శిటీకి అనుబంధంగా 1981లో స్థాపించిన ఎంవీఎస్ఆర్ కాలేజీలో నేటి వరకు విద్య పూర్తి చేసుకున్న సుమారు 350కి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి నాడు పాఠాలు బోధించిన అధ్యాపకులతో సమావేశం నిర్వహించి అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.గుంటూరు విజయ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులందరూ తమతో పాటు చదువుకుని ఇంకా స్థిరపడని వారిని పైకి తీసుకురావడానికి అందరూ కలిసి ముందుకు రావడం చాలా సంతోషమన్నారు. అలాగే చదువులు నేర్పిన కాలేజీని రెండేళ్లల్లో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేలా చేస్తామని హామీనివ్వడం ఆనందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో చైర్మన్ వీవీఆర్ కాశ్యప్, కోశాధికారి సుధాకర్ జూపూడి, సెక్రటరీ కేపీ శ్రీనివాస్‌రావు, కాలేజీ అధ్యక్షుడు ఎస్.సీహెచ్. విజయభాస్కర్, పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు, ఆధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానపరచడం సరికాదు



షాద్‌నగర్: వెలిజర్లలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

షాద్‌నగర్: మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు తుప్పరి జంగయ్య, న్యాయవాది దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. దేశ ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడిన అమిత్‌షాకు పదవిలో కొనసాగే నైతిక హక్కులేదన్నారు. కార్యక్రమంలో నాయకులు తుప్పరి శంకర్, తుప్పరి శ్రీశైలం, రాజు, శివకుమార్, యాదగిరి, రమేశ్, యాదయ్య, ప్రభు, భైండ్ల మల్లేశ్, జంగయ్య, వెంకటేశ్, రమేశ్, శ్రీకాంత్, దొడ్డి చందు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి


కొందుర్గు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు భిక్షపతి డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు శనివారం కొందుర్గు ముఖ్య కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం భిక్షపతి మాట్లాడుతూ.. 90 శాతం జనాభా ఉన్న ఎస్సీ, బీసీ, మైనార్టీల ఆరాధ్యదైవమని సంబోధించారు. అలాంటి అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య. రవీందర్, రాములు, విజయ్, అక్బర్, అశోక్, ఉదయ్, నర్సింలు, సందీప్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: నల్గొండ పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలుగౌడ్ కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింలుగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్గొండ పట్టణంలో ఈ నెల 28, 29, 30న నిర్వహించే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బన్సీలాల్, ఎంఈఓ మనోహర్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బిజిలి సత్యం, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు.. ప్రయాణికుల పాట్లు

- ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో గుంతలుగా మారిన దారులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



కంకరతేలి అధ్వానంగా మారిన చిలుకూరు-మొయినాబాద్ రోడ్డు



అధ్వానంగా సురంగల్-శ్రీరాంనగర్ రోడ్డు

మొయినాబాద్: గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలుపడి, కంకర తేలడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ఏళ్లుగా మరమ్మతులకు నోచుకకపోవడంతో గతంలో వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులకు ఈ రోడ్లపై ప్రయాణం నరకంగా మారింది. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా గ్రామాల రోడ్లకు మోక్షం లభించడం లేదు. గతంలో పలు రోడ్లకు నిధులు మంజూరైన పనులు చేట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

గుంతలతో అవస్థలు

మండలంలోని సురంగల్–శ్రీరాంనగర్, కనకమామిడి-వెంకటాపూర్, మొయినాబాద్-చిలుకూరు, పెద్దమంగళారం–చందానగర్, తోలుకట్ట-నక్కలపల్లి, ఎనికేపల్లి-బాకారం, వెంకటాపూర్–నక్కలపల్లి, రెడ్డిపల్లి-చిన్నమంగళారం రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గత వర్షాకాలంలో రోడ్లపై కంకర తేలి, పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి గుంతలకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రస్తుతం రోడ్లపై నడవలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్లపై వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నిధులు మంజూరైనా మొదలుకాని పనులు

మండలంలోని కొన్ని రోడ్ల అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరయ్యాయి. కానీ ఆ రోడ్ల పనులు ఇంతవరకు మొదలుకాలేదు. రోడ్ల అభివృద్ధి పనులు త్వరగా చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు పదేళ్లుగా ఈ రోడ్ల అభివృద్ధికి నోచుకోవడం లేదని గుంతల రోడ్లలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని మండిపడుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రోడ్ల పరిస్థితిలో మార్పు రావడంలేదు. గతంలో నిధులు మంజూరైనా రోడ్లు బాగుపడకపోగా.. ప్రస్తుత ప్రభుత్వం కూడా రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టడంలేదు. దీంతో ప్రజలు రోడ్ల విషయంలో తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మండలంలోని రోడ్లన్నీ గుంతలుగా మారాయి. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో ఐదు నిమిషాల్లో వెళ్లే దూరానికి అరగంటకు పైగా సమయం పడుతోంది. అడుగడుగునా గుంతలు, కంకర తేలడంతో వాహనాలు చెడిపోతున్నాయి. రాత్రిపూట గుంతల్లో వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– సంతోష్, సురంగల్, మొయినాబాద్

ప్రదిపాదనలు పంపుతున్నాం



మండలంలోని చాలా గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. అయితే గతంలోనే కొన్ని రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. చిలుకూరు–మొయినాబాద్ రోడ్డు పనులు మొదలయ్యాయి. కనకమామిడి–వెంకటాపూర్ రోడ్డు పనులు త్వరలోనే మొదలవుతాయి. మిగిలిన రోడ్లకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ, మొయినాబాద్